క్లుప్తంగా

కొండముచ్చుకు అంత్యక్రియలు



దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ వాసులు ఓ కొండముచ్చుకు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడి బావి వద్ద ఉన్న చెట్లపై కొండముచ్చు వెళ్తున్న క్రమంలో కరెంట్ తీగెలపై పడి షాక్‌కి గురైంది. దీంతో తీవ్రంగా గాయపడింది. ఆరోగ్యం క్షీణించటంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. గ్రామ సర్పంచ్ కూసం నాగిరెడ్డి సూచన మేరకు స్థానికులు ఆటోలో కొండముచ్చు కళేబరాన్ని శ్మశాన వాటిక వద్దకు మేళతాళాలతో తీసుకెళ్లారు. అక్కడే ఖననం చేశారు. అదే సమయంలో మరో కొండముచ్చు వచ్చి ఇదంతా చూస్తూ కనిపించింది.

వ్యాధుల నివారణపై అవగాహన



పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదు కావటంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే ప్రతి ఇంటికి వెళ్లి డయేరియా, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రజలు నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. తినే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు బాల అంకమ్మ, నస్రీన్, అన్వేష్, ఏపీహెచ్ఈవో పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, ఇ. శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు, హెచ్‌వీ విజయ, ఆరోగ్య సిబ్బంది డాక్టర్ అంజిరెడ్డి, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల ఫోర్జరీపై కొనసాగుతున్న దర్యాప్తు



దాచేపల్లి: తహసీల్దార్, వీఆర్వోల సంతకాలు ఫోర్జరీ కేసులో విచారణ కొనసాగుతోందని తహసీల్దార్ గీతావాణి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓ రైతు బ్యాంకు రుణాలకు సంబంధించి రెవెన్యూశాఖ తరఫున ఇచ్చే పత్రంపై తన సంతకంతోపాటు భట్రుపాలెం వీఆర్వో సంతకం ఫోర్జరీ చేసినట్లుగా గుర్తించామని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని పోలీసులకు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఆ మేరకు వారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని కోరామని, ఈ వ్యవహారంలో తనపై దుష్ప్రచారం తగదని అన్నారు.

ఏకాదశి పూజలకు ఆలయాల్లో ఏర్పాట్లు



కారెంపూడి తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలోని ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. పల్నాడులో చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం, లలిత సహస్ర పారాయణం చేయడానికి మహిళా భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి కొమండూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. సింగరుట్ల శ్రీ లక్ష్మీనారసింహస్వామి వారి క్షేత్రంలో సుదర్శన నారసింహ హోమం, స్వామి వారికి ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ అర్చకులు మారేపల్లి వేంకట రమణాచార్యులు పేర్కొన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేసినట్లు తెలిపారు.

నేడు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నేడు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని దేవస్థానం చైర్మన్ పాతూరి వెంకట రమసుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం

- చావిడిలలో ప్రత్యేక అలంకరణలో పీర్లు
- నేడు దాచేపల్లిలో తిరునాళ్ల మహోత్సవం

దాచేపల్లి : మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ నిలుస్తోంది. కులం, మతం అనేది చూడకుండా ప్రతి ఒక్కరు ఈ పండుగను జరుపుకొంటారు. పేరుకు ఈ పండుగ ముస్లింలది అయినప్పటికీ హిందువులతోపాటుగా అన్ని కులాలు, మతాల వారు ఘనంగా నిర్వహించుకోవడం విశేషం. ఉగాది, సంక్రాంతి, దసరా పండుగలతో సమానంగా వేడుక చేసుకోవడం ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ. పల్నాడు జిల్లాలోనే దాచేపల్లిలో జరిగే మొహర్రం వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. వెండి, ఇత్తడి వంటి పంచలోహాలతో ఎవరి శక్తికొలది వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయటం విశేషం. తాము చేయించిన పీర్లకు ఏటా మొహర్రం పండుగ సందర్భంగా భక్తులు పూలు, దుస్తులు, బొరుగులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ప్రత్యేక ఆకర్షణగా పీర్లు

దాచేపల్లిలో ప్రత్యేకంగా ఆకర్షణగా పీర్లు నిలుస్తాయి. దాచేపల్లిలోని రెండు చావిడిలలో గంధం పీర్లు ఉన్నాయి. ఈ పీర్లను ప్రత్యేకంగా అలంకరణ చేసి పీర్ల చావిడిలో నిలిపారు. అదే విధంగా దాచేపల్లి, కేసానుపల్లి, నడికుడి, ఇరికేపల్లి, గామాలపాడు, తంగెడ, ముత్యాలంపాడు, రామాపురం, పొందుగల, శ్రీనగర్, పెదగార్లపాడు తదితర గ్రామాల్లోని చావిడిలలో కట్టిపీర్లను కూడా శుభ్రం చేసి నిలిపారు. మూడు, ఐదు, ఏడు షరగత్తులలో చావిడిలలో నిలబెట్టిన పీర్లను బయటకు తీసి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. పీర్లను భక్తులు దర్శించుకుని మొక్కులు సమర్పిస్తారు. పీర్ల పండుగ సందర్భంగా చావిడిలలో ఏర్పాటు చేసిన నిప్పుల గుండం మీదుగా పీర్లను ఎత్తుకుని దాటడం ఇక్కడ ప్రత్యేకంగా ఉంటుంది.



ఇరికేపల్లి చావిడిలో అలంకరణలో పీర్లు



దాచేపల్లి చావిడిలోని గంధం పీర్లు

నేడు తిరునాళ్ల

మొహర్రం పండుగ సందర్భంగా బుధవారం దాచేపల్లిలో తిరునాళ్ల జరుపుకొంటారు. అలంకరణ చేసిన వాటిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. ఇదంతా సందడి సందడిగా ఉంటుంది. వివిధ వేషధారణలతో పలువురు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. హైస్కూల్ వద్ద జెయింట్ వీల్‌ని ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు సీఐ ఎ. సురేంద్రబాబు తెలిపారు.



ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సత్యప్రసాద్

కారెంపూడి డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ పి. సత్య ప్రసాద్ గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. నివాస ప్రాంతాలలో వ్యర్థాలు లేకుండా చూడాలని, మురుగు కాల్వలను శుభ్రం చేస్తుండాలని, వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేస్తుండాలని, బోర్లు ఇతర నీటి వనరుల శాంపిల్స్ సేకరించి తరచూ పరీక్షించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా పరిశుభ్రమైన నీరు తాగాలని, లేకుంటే కాచి చల్లార్చిన నీరు తాగాలని కోరారు. ముఖ్యంగా బుధవారం తొలి ఏకాదశి, మొహర్రం పండుగల నేపథ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ కె. సుబ్బారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దళిత బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుణ్ని అరెస్ట్ చేయాలి

సత్తెనపల్లి: దళిత బాలికపై అత్యాచారం, హత్య చేసిన నిందితుడ్ని వెంటనే అరెస్టు చేయాలని పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు మంగళవారం డిమాండ్ చేశారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న బాలికను అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన గ్యాస్ డెలివరీ బాయ్‌ను వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్ట్ చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని, ఆ కుటుంబానికి న్యాయం జరగని పక్షాన రాష్ట్రంలో ఉన్న టువంటి అన్ని జిల్లాల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు.

అనారోగ్యంతో రెంటచింతల తహసీల్దార్ మృతి



సబ్బు రామ్ మోహన్‌రావు (ఫైల్)

రెంటచింతల: రెంటచింతల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సబ్బు రామ్ మోహన్‌రావు అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ నెల 1న తన స్వగ్రామం ఒంగోలు నుంచి రెంటచింతలకు రైలులో ప్రయాణిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వెంటనే సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఒంగోలు పట్టణంలోని సంఘమిత్ర ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మరోసారి ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్ మోహన్‌రావును అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం సూచనల మేరకు రెంటచింతల తహసీల్దార్‌గా నియమించారు. ఫిబ్రవరి 9న ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ఐ డి. కాంతారావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

క్రోసూరు: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతున్న యువ కౌలు రైతు సోడిసెట్టి గోపాలకృష్ణ(26) మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన గోపాలకృష్ణ వ్యవసాయంలో అప్పులు ఎక్కువ కావటంతో మనస్థాపానికి గురై ఈ నెల 10వ తేదీ ఇంటి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పరిస్థితి గుర్తించిన కుటుంబీకులు గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం కలరు. ఆసుపత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నూతన చట్టాలను నిలుపుదల చేయాలి



న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన చట్టాలను నిలుపుదల చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల రవి ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. అనంతరం నూతన చట్టాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మర్రి వెంకట సుబ్బారెడ్డి, డి.శ్రీనివాసరావు, జె.విజయ్ కుమార్, అంకాళ్ళ వెంకటేశ్వర్లు, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, సూరె వీరయ్య, బూతుకూరి రామిరెడ్డి, షేక్ జానీ ఖాజావలి, పిల్లి సుధీర్ బాబు, నాగూర్ బాబు, తవ్వా హరినాథ్, మామిడి ప్రకాష్, గుర్రం పవన్, బొమ్మిశెట్టి శ్రీనివాస్, గుజ్జర్లపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమలు తీరుపై గ్రామ సభలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, తొండపి, లంకెలకూరపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను గ్రామ సభలో వినిపించారు. మస్టర్ షీట్‌లో నిర్వహణ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. లంకెలకూరపాడులో జరిగిన గ్రామ సభకు పంచాయతీ కార్యదర్శి హాజరు కాకుండా ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద రికార్డులు అప్పగించలేదని సభలో సభ్యులు వివరించారు. పని ప్రాంతాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన విజిటర్ల రికార్డుల నిర్వహణలోనూ లోపాలున్నట్లుగా గుర్తించారు. ఆయా గ్రామ సభల్లో గుర్తించిన అంశాలను నమోదు చేసుకున్నారు. గ్రామ సభలో ఎస్సార్పీ ఎం.లోకేష్, డీఆర్పీలు శివ, శరత్‌కుమార్, తిరుపాల్, కిషోర్, ఆయా గ్రామాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ ఎం.శివకుమారి

ముప్పాళ్ళ: రైతులు భూసార పరీక్షల ఆధారంగా సాగు చేసే పంటలలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభసాటిగా ఉంటుందని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో నీటి ఎద్దడిలో సాగు చేసుకోవాల్సిన పంటల పరిస్థితిపై రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎం.శివకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసే పొలం మట్టిని పరీక్ష చేయించుకొని, ఫలితాల ఆధారంగా పంటకు అవసరమైన పోషకాలు అందించేలా ఎరువులు వినియోగించుకోవాలని చెప్పారు. అతిగా ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతినడంతో పాటు, పంటలకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి పి.ప్రవీణ్ ప్రకృతి ప్రాముఖ్యత ఆవశ్యకతలను వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏలు శైలజ, సుభాని, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు అందించాలి



రాజుపాలెం: ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు కార్డు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలనే లక్ష్యంతో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఆటో ప్రచార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమం రాజుపాలెం, రెడ్డిగూడెం, ఆర్ అండ్ ఆర్ సెంటర్, గణపవరం, బలిజేపల్లి, ఉప్పలపాడు, ఇనిమెట్ల గ్రామాలలో నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాయలంలోని సీనియర్ అసిస్టెంట్ కవితకు వినతి పత్రం, కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా క్రాఫ్ లోన్‌లు ఇప్పించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ మండల కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, ఏరియా కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు

రాజుపాలెం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని పిడుగురాళ్ల బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు తెలిపారు. మండలంలోని గణపవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించక పోవడం వలన యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని తెలిపారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించక పోవడం చట్టరీత్యా నేరమని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు శిక్ష పడే విధంగా చట్టాలున్నాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అలా వాహనాలు నడపరాదు

అమరావతి: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరాదని, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మోటారు వాహనాల చట్టం గురించి మంగళవారం అమరావతిలో శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిఁచారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటిరచాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు ఎక్కువగా గాయం కావడం వల్ల చనిపోతున్నారని అందువల్ల తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఉత్తమ వైద్య ప్రమాణాలకు గుర్తింపు

రెంటచింతల: జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ రామస్వామి, డాక్టర్ మహతబ్ సింగ్‌లు గోలి గ్రామానికి 90, మిట్టగుడిపాడు గ్రామానికి 87.8 మార్కులు ఇచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, గోలి వైద్యులు వి.ప్రదీప్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. దేశంలోని ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) తరఫున ఆయా గ్రామాలలోని హెల్త్ క్లినిక్‌లలో ఉన్న తీరును పరిశీలించి ఈ మార్కులు కేటాయిస్తుంటారని పేర్కొన్నారు. నాణ్యతలో రోగి భద్రత కీలకమైన అంశమని తెలిపారు.

కనికరం చూపే తల్లి కార్మెల్‌మాత



విద్యుత్ కాంతులలో కార్మెల్‌మాత మందిరం

రెంటచింతల: కనికరం కలిగిన తల్లి కార్మెల్‌మాత అని కానుకమాత చర్చి సహాయక గురువులు రె.ఫాదర్ అగస్టీన్ అన్నారు. స్థానిక నాయుడుపేట కాలనీలో మాజీ సర్పంచి గుర్రాల రాజు నిర్మించిన కార్మెల్‌మాత మందిరం 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో ఫాదర్ అగస్టీన్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనల ద్వారా కోరిన వరాలు ఇచ్చే తల్లిగా కార్మెల్‌మాత పేరొందారని తెలిపారు. ఈ మందిరం గ్రామానికే ప్రత్యేకత తీసుకొచ్చిందన్నారు. సమిష్టి దివ్య పూజాబలి అనంతరం గుర్రాల రాజు భక్తులకు అన్నదానం చేపట్టారు. కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలలో తెలుగు రాష్ట్రాల భారతమిత్ర డైరెక్టర్ ఫాదర్ డేవిడ్, ఫాదర్ కొనతం ఏలీషారాజు, మఠకన్యలు, కానుకమాత చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సాగు పనుల్లో అన్నదాతలు



పొలంలో మిర్చి మొక్కలు నాటుతున్న దృశ్యం

పిడుగురాళ్ల: కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండటంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొంత మంది ముందస్తుగా కొన్ని పంటలను వేశారు. మరికొందరు భూమి పదునెక్కించి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు కూడా రెండు రోజుల నుంచి పడుతుండటంతో మంగళవారం పనులు ముమ్మరం చేశారు. మిర్చి మొక్కలు, పత్తి విత్తనాలు, కంది విత్తనాలు నాటారు. చాలాచోట్ల బోర్ల కింద మాత్రమే వరి నాట్లు వేసేందుకు అన్నదాతలు నారుమళ్లు చేశారు. కొంత మంది మాత్రమే నాట్లు వేశారు. కృష్ణానదిలో నీటినిల్వ, నాగార్జున సాగర్‌లో నీటిమట్టం పెరగక పోవడంతో పంట వేస్తే ఏమవుతోందని రైతులు ఆలోచిస్తున్నారు. వరి నాట్లు వేయకుండా సాగర్ నీటి గురించి ఆరా తీసుకుంటూ భూమిని పదును చేసి ఉన్నారు.

రెంటచింతల ఇన్‌చార్జి ఎంఈఓ-1గా ఏసుబాబు



బాధ్యతలు చేపట్టిన ఏసుబాబును సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

రెంటచింతల: రెంటచింతల ఇన్‌చార్జి ఎంఈఓ-1గా వై. ఏసుబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నర్సరావుపేట ఎంఈఓగా, నకరికల్లు ఇన్‌చార్జి ఎంఈఓగా, సత్తెనపల్లి డిప్యూటీ డీఈఓగా విధులు నిర్వహిస్తున్న వై. ఏసుబాబుకు అదనంగా ఈ బాధ్యతలు కూడా అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న వేముల నాగయ్య జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. ఏసుబాబు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఏసుబాబును ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఎస్. మంగయ్య, పి. సుమతి గ్రేస్, డి. లింగయ్య, బి. సైదయ్య సన్మానించారు.

మహిళలు అప్రమత్తతతో మెలగాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం

అచ్చంపేట: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింస, అక్రమ రవాణా వంటి చర్యల పట్ల మహిళలు అప్రమత్తంగా మెలగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మాణిక్యం తెలిపారు. స్థానిక కస్తూరిబా బాలిక పాఠశాల/జూనియర్ కళాశాలలో సంకల్ప మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మీ సమీపంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రుతుక్రమంపై అపోహలు, పాటించవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాని



సత్తెనపల్లి: సీపీఎస్ గెజిట్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని మంగళవారం డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత జీపీఎస్ గెజిట్‌ను ప్రకటించి 2023 అక్టోబర్ నుంచి అమలులోకి వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా సీపీఎస్‌ను ఓపీఎస్‌గా మార్చాలనలి కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగిందన్నారు. కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయుల కల అయిన ఓపీఎస్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతూ డిప్యూటీ డీఈవోలకు, ఎంఈవోలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఎంఈఓ-2లను రద్దు చేసి ప్రతి మండలానికి ఒక ఎంఈవో చొప్పున అడహక్ పద్ధతిలో ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలన్నారు. జీవో 117ను రద్దు చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదపిల్లలకు 'తల్లికి వందనం' వర్తించేటట్లు చర్యలు తీసుకుంటూ విద్యా ప్రమాణాల నాణ్యతను పెంచాల్సిందిగా కోరారు.